# కేయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ రిమాండ్

### ఒక్కొక్కటిగా బయటకు వస్తున్న అక్రమాలు

హనుమకొండ చౌరస్తా, జనవరి 6: కాకతీయ యూనివర్సిటీలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్టయ్యను శనివారం హైదరాబాద్‌లోని ఏసీబీ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఆయన రూ. 50 వేలు లంచం తీసుకుంటూ శుక్రవారం ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే. అయితే, హాస్టళ్లకు కేవలం పాలు, పెరుగు సరఫరా చేసే కాంట్రాక్టర్ వద్దే కాకుండా ఇతర వస్తువులు సరఫరా చేసే కాంట్రాక్టర్ల వద్ద నుంచి కూడా వివరాలు సేకరించినట్లు తెలుస్తున్నది. దీంతో ఒక్కొక్కటిగా అక్రమాలు బయటకు వస్తున్నట్లు సమాచారం. కిష్టయ్య ఆర్ట్స్ కాలేజీ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పని చేసిన సమయంలో విద్యార్థుల ఫీజుల విషయంలో రూ. 3 కోట్ల అక్రమాలు జరిగినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో విచారణ కొనసాగుతుండగానే.. ఎలాంటి చర్యలు తీసుకోకుండా వీసీ తాటికొండ రమేశ్ మళ్లీ కిష్టయ్యను తీసుకొచ్చి యూనివర్సిటీ అకౌంట్స్ అప్పగించడం, బిల్లుల రూపకల్పన, ఆడిటింగ్, మంజూరు అంశాలు ఆయన చేతిలో పెట్టడడంతో అనేక అక్రమాలు జరిగి ఉండొచ్చనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా, హనుమకొండ రెవెన్యూ కాలనీలోని కిష్టయ్య ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో సోదాలు చేయగా పలు విలువైన పత్రాలు, బంగారం లభించినట్లు తెలిసింది.

# నగరానికి నాలుగోసారి..

## ఓడీఎఫ్ ప్లస్ ప్లస్‌లో గ్రేటర్‌కు చోటు

- బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత నగరాల జాబితాలో స్థానం
- దేశంలో అతి కొద్ది నగరాలకే ఘనత
- పారిశుధ్య నిర్వహణే ప్రామాణికం
- ఎంవోయూఏ అభినందనలు
- హర్షం వ్యక్తం చేసిన మేయర్
- ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తామన్న మున్సిపల్ కమిషనర్



వివరాలు వెల్లడిస్తున్న మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, డిప్యూటీ కమిషనర్ అనిసుర్ రషీద్



వరంగల్, జనవరి 6 : గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మరో ఘనతను సొంతం చేసుకుంది. సెంట్రల్ మినిస్ట్రీ ఆఫ్ అర్బన్ ఎఫైర్స్ (ఎంవోయూఏ) మంత్రిత్వ శాఖ విడుదల చేసిన బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత నగరాల జాబితాలో గ్రేటర్ వరంగల్ వరుసగా నాలుగోసారి స్థానం సంపాదించింది. దేశ వ్యాప్తంగా చేపట్టిన సర్వేలో అతి కొద్ది నగరాలే ఈ ఘనతను సాధించాయి. వరుసగా 2020 నుంచి 2021, 2022, 2023లో ఓరుగల్లు సత్తా చాటుతూ రావడం గొప్పవిషమని అధికారయంత్రాంగం ప్రకటించింది. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన పట్టణ ప్రగతితో వరంగల్ మహానగరం సమగ్రంగా అభివృద్ధి చెందింది. ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణలో ఉత్తమంగా నిలుస్తున్నది. పట్టణ ప్రగతిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి కోసం ప్రతి నెలా రూ.7.50 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో పారిశుధ్య నిర్వహణ పనులు పూర్తయ్యాయి. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణను పక్కాగా నిర్వహించింది. ఆటోలు, ట్రాక్టర్లు, లారీలతో ప్రతిరోజూ చెత్తను తరలించింది. డంపింగ్ యార్డు నిర్వహణతోపాటు మానవ వ్యర్థాల నిర్వహణలోనూ జీడబ్ల్యూఎంసీ కొత్త విధానాన్ని అమలు చేసింది. అమ్మవారిపేటలో ఏర్పాటు చేసిన మానవ వ్యర్థాల ప్లాంటుతో గ్రేటర్ వరంగల్ నగరం ఓడీఎఫ్‌లో ఉత్తమంగా నిలిచేందుకు మార్గం సుగమమైంది.

### మేయర్ హర్షం

ఎంవోయూఏ రూపొందించిన ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ జాబితాలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ వరుసగా నాలుగో సంవత్సరం కూడా చోటు సాధించినందుకు మేయర్ గుండు సుధారాణి హర్షం వ్యక్తం చేశారు. కార్పొరేషన్ పరిధిలో ఇంటింటికీ మరుగుదొడ్ల నిర్మాణం, ఆధునిక పద్ధతిలో పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు, నిర్వహణతో పాటు మురుగునీటి శుద్ధీకరణ (ఎస్టీపీ) మానవ వ్యర్థాల శుద్ధీకరణ (ఎఫ్ఎస్టీపీ) కోసం చేపడుతున్న విధానాలు, ప్రతి మూడు సంవత్సరాలకోసారి ప్రతి ఇంటి సెప్టిక్ ట్యాంకుల నుంచి మానవ వ్యర్థాల సేకరణ, నూతన ట్యాంక్ క్లీనింగ్ యంత్రాలకు అనుమతుల మంజూరు, కార్పొరేషన్ ఆధ్వర్యంలో పలు యంత్రాల వినియోగంలాంటి చర్యల వల్లే ఈ ఘనత సాధ్యమైందన్నారు. త్వరలో ఎంవోయూఏ నుంచి సర్టిఫికెట్ అందుకోనున్నట్లు తెలిపారు. ఇదే స్ఫూర్తితో 2023 స్వచ్ఛ సర్వేక్షన్ పోటీల్లో మరింత మెరుగైన ర్యాంకు సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఓడీఎఫ్ ప్లస్ ప్లస్‌లో వరుసగా నాలుగోసారి చోటు దక్కడం కోసం తమ వంతు సహాయ సహకారాలు అందించిన గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, మంత్రివర్యులకు, పార్లమెంట్ సభ్యులకు, శాసన సభ్యులకు, శాసన మండలి సభ్యులకు, కార్పొరేటర్లకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గ్రేటర్ కార్పొరేషన్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ ఓడీఎఫ్ ప్లస్ ప్లస్‌లో వరంగల్‌కు చోటు దక్కేందుకు చేసిన కృషిని వివరించారు. ఇదే స్ఫూర్తితో ముందుకు పోతూ కార్పొరేషన్ పరిధిలో మరింత ప్రగతి సాధించేందుకు కృషి చేస్తామన్నారు.

#### కేంద్ర మంత్రిత్వశాఖ అభినందనలు

బహిరంగ మల, మూత్ర విసర్జన నియంత్రణకు వరంగల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇంటింటికీ మరుగుదొడ్ల నిర్మాణం, పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు, వాటికి సాంకేతికత అనుసంధానం, పక్కాగా నిర్వహణ లాంటి చర్యలు అభినందనీయమని సెంట్రల్ మినిస్ట్రీ ఆఫ్ అర్బన్ ఎఫైర్స్ మంత్రిత్వశాఖ కొనియాడింది. దేశ వ్యాప్తంగా వివిధ నగరాల్లో చేపట్టిన, అనుసరిస్తున్న ఆధునిక శానిటేషన్ సంబంధ విధానాలను ప్రమాణాలుగా తీసుకొని ఎంపిక చేసినట్లు వివరించింది.



రూ. 13.36 కోట్ల పెండింగ్ చలాన్ల వసూలు

- వరంగల్ ట్రైసిటీలో డిస్కౌంట్‌ను వినియోగించుకుంటున్న వాహనదారులు
- 4,75,816 చలాన్లు క్లియర్

సుబేదారి, జనవరి 6: ట్రాఫిక్ పెండింగ్ చలాన్ల చెల్లింపునకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన డిస్కౌంట్‌ను వాహనదారులు వినియోగించుకుంటున్నారు. బైక్‌లు, ఆటోలకు 80 శాతం, కార్లు, ఇతర హెవీ మోటర్ వెహికిల్స్, ట్రక్కులకు ప్రభుత్వం 60 శాతం రాయితీ ఇచ్చింది. ఈ నెల 10వ తేదీ వరకు గడువు విధించింది. ఈ అవకాశాన్ని పెండింగ్ చలాన్లు ఉన్న వాహనదారులు సద్వినియోగం చేసుకుంటున్నారు. గ్రేటర్‌లోని వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 2019 జనవరి నుంచి 2023 డిసెంబర్ వరకు 23 లక్షల చలాన్లు నమోదయ్యాయి. ఈ క్రమంలో ప్రభుత్వం డిస్కౌంట్ ఇవ్వడంతో డిసెంబర్ 27 నుంచి ఈ నెల 6వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ట్రైసిటీలో 4,75,816 చలాన్లకు సంబంధించిన వాహనదారులు ఆన్‌లైన్ ద్వారా రూ. 13,36,26,620 చెల్లించినట్లు వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ బోజరాజు తెలిపారు. ఇదిలా ఉంటే.. చలాన్ల చెల్లింపుల్లో హనుమకొండ, వరంగల్ జిల్లాల ఉన్నతాధికారుల వాహనాలు ఉన్నాయి.



గిరబోయిన భాగ్యలక్ష్మిని సన్మానిస్తున్న జడ్పీ సీఈవో అనిల్ కుమార్, అధికారులు, సిబ్బంది

## జనగామ జడ్పీ చైర్‌పర్సన్‌గా భాగ్యలక్ష్మి

- జడ్పీ కార్యాలయంలో బాధ్యతల స్వీకరణ
- పాగాల సంపత్‌రెడ్డి హఠాన్మరణంతో ఖాళీ అయిన స్థానం
- వైస్ చైర్‌పర్సన్‌గా ఉండడంతో దక్కిన పదవి

జనగామ, జనవరి 6 (నమస్తే తెలంగాణ) : జనగామ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా గిరబోయిన భాగ్యలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు జడ్పీ కార్యాలయంలో శనివారం ఆమె బాధ్యతలు స్వీకరించగా, సీఈవో అనిల్‌కుమార్, అధికారులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు శుభాకాంక్షలు తెలిపారు. మొన్నటి వరకు జడ్పీచైర్మన్‌గా ఉన్న పాగాల సంపత్‌రెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో పంచాయతీరాజ్ నిబంధనల మేరకు బచ్చన్నపేట జడ్పీటీసీగా గెలుపొంది జడ్పీ వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన భాగ్యలక్ష్మిని చైర్‌పర్సన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త జిల్లాగా ఆవిర్భవించిన జనగామ జిల్లా పరిషత్ పాలకవర్గం 2019 జూన్ 8న ఎన్నికైంది. ఈఏడాది జూన్ వరకు అంటే మరో ఆరునెలల కాలానికి జడ్పీచైర్‌పర్సన్‌గా వ్యవహరించే అరుదైన అవకాశం భాగ్యలక్ష్మికి దక్కింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జనగామ జిల్లా అభివృద్ధి సమిష్టి బాధ్యతగా గుర్తించి కలిసి పనిచేద్దామన్నారు. భాగ్యలక్ష్మిని జనగామ, నర్మెట జడ్పీటీసీ సభ్యులు నిమ్మతి దీపిక మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు గౌస్‌పాషా, జనగామ ఎంపీపీ మేకల కళింగరాజు, జడ్పీటీసీ డిప్యూటీ సీఈవో వసంత, అధికారులు అభినందించారు.



పస్రా –మేడారం రోడ్డును పరిశీలిస్తున్న మంత్రి సీతక్క, చిత్రంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అధికారులు

# భక్తులకు ఇబ్బందులు కలుగొద్దు

- ఈ నెల చివరి నాటికి పనులు పూర్తి చేయాలి
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- రహదారుల మరమ్మతు పనుల పరిశీలన
- మేడారం జాతర పరిసరాల్లో పర్యటన


తాడ్వాయి, జనవరి 6 : మేడారం మహా జాతర సందర్భంగా వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె రహదారుల మరమ్మతులు, అభివృద్ధి పనులను కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీశ్, ఐటీడీఏ పీవో అంకిత్‌తో కలిసి పరిశీలించారు. ముందుగా చింతల్‌క్రాస్ వద్ద పార్కింగ్ స్థలం, బీటీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం ఊరట్టం లోలెవల్ కాజ్‌వే మరమ్మతు పనులను ప్రారంభించారు. జంపన్నవాగు వరదల కారణంగా ఊరట్టం వద్ద ఎక్కువగా నష్టం వాటిల్లే అవకాశం ఉన్నందున కరకట్ట నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జాతరకు ప్రభుత్వం రూ.75కోట్లు మంజూరు చేసిందని, అదనంగా నిధుల కోసం అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటి సారి జాతరను అత్యంత వైభవంగా నిర్వహించడంతో పాటు మేడారం విశిష్టత ప్రపంచ నలుమూలలా తెలిసేలా చర్యలు తీసుకుంటామన్నారు. జాతరకు జాతీయ హోదా కల్పించాలని కేంద్రాన్ని కోరామని, త్వరలోనే ప్రకటన వస్తుందని ఆశిస్తున్నామన్నారు. భక్తుల సౌకర్యాల కల్పనకు సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ప్లాస్టిక్ ఇతర వ్యర్థాలను భక్తులు ఎక్కడపడితే అక్కడ వేస్తున్నారని, దీని వల్ల స్థానిక గిరిజనులు ఇబ్బందులకు గురవుతున్నారని, ప్లాస్టిక్, సీసాలను ఒకచోట పడవేయాలని భక్తులను కోరారు. జాతర సమీపిస్తున్నందున ఈ నెల చివరిలోగా పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సీతక్క సమ్మక్క, సారలమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మంత్రివెంట అదనపు కలెక్టర్లు శ్రీజ, వేణుగోపాల్, అధికారులు ఉన్నారు.

#### లోలెవల్ కాజ్‌వేకు మరమ్మతులు

ఊరట్టం సమీపంలోని లోలెవల్ కాజ్‌వే మరమ్మతు పనులను శనివారం ఐటీడీఏ ఇంజినీరింగ్‌శాఖ అధికారులు ప్రారంభించారు. ఖమ్మం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి ప్రైవేట్ వాహనాల్లో వచ్చే భక్తులను ఏటూరునాగారం మండలంలోని కొండాయి, ఊరట్టం గ్రామ సమీపంలోకి అనుమతిస్తారు. అక్కడ వారు విడిది చేసిన అనంతరం అమ్మవార్లను దర్శించుకునేందుకు ఈ కాజ్‌వే నుంచే గద్దెల వద్దకు చేరుకునే అవకాశం ఉంటుంది. వరదల కారణంగా కాజ్‌వే కొట్టుకుపోవడంతో సుమారు రూ.25లక్షలతో మరమ్మతు పనులు చేస్తున్నారు. అలాగే ఊరట్టం స్తూపం నుంచి అమ్మవార్ల గద్దెల వరకు గల రహదారిలో ప్యాచ్‌వర్క్ పనులను శనివారం ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రారంభించారు. పాడైన రోడ్డు స్థానంలో కొత్త బీటీ వేస్తున్నారు.

# మేడారంలో కన్వేయర్ బెల్ట్

- రూ.80 లక్షలతో ఏర్పాటుకు సన్నాహాలు
- నేరుగా తల్లుల చెంతకు బంగారం చేరేలా చర్యలు
- మంత్రి సీతక్కకు వివరించిన ఇంజినీరింగ్ అధికారులు




మేడారంలో ఏర్పాటు చేయనున్న కన్వేయర్ బెల్ట్ నమూన


తాడ్వాయి, జనవరి 6 : సమ్మక్క-సారలమ్మల దర్శనానికి వచ్చే భక్తులు సమర్పించే బంగారం(బెల్లం) నేరుగా తల్లుల చెంతకు చేరేలా దేవాదాయశాఖ అధికారులు కన్వేయర్ బెల్టు ఏర్పాటు చేయనున్నారు. ప్రధాన గేట్ వద్ద ఏర్పాటు చేసే బెల్ట్‌పై భక్తులు బెల్లం బుట్టలను పెడితే అది నేరుగా తల్లుల గద్దెలపైకి చేరుతుంది. గతంలో భక్తులు ఇష్టమొచ్చినట్లు బెల్లం విసరడంతో గద్దెలపై పేరుకుపోయేది. దానిని శుభ్రం చేయించడం అధికారులకు ఇబ్బందిగా మారేది. అంతేకాకుండా బెల్లం కరిగి భక్తుల కాళ్లకు అంటుకొని జాతర పరిసరాలు మొత్తం వ్యాపించేది. దీంతో ఈగల బెడద పెరుగుడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేది. ఈ సమస్యను అధిగమించేందుకు అధికారులు సుమారు రూ.80లక్షలతో సమ్మక్క గద్దెకి బెల్ట్ ద్వారా బెల్లం చేరేలా చర్యలు చేపట్టారు. ఇది సక్సెస్ అయితే వచ్చే జాతరకు సారలమ్మ గద్దె వద్దకు బెల్లం చేర్చేందుకు, గద్దెలపై పోగైన బెల్లాన్ని బయటకు తరలించేందుకు కన్వేయర్ బెల్టులను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయనున్నారు. ఈమేరకు శనివారం ఓ సంస్థకు చెందిన ఇంజినీరింగ్ అధికారులు సాధ్యాసాధ్యాలపై దేవాదాయశాఖ అధికారులు డీసీ శ్రీకాంత్‌రావు, ఏసీ సునీత, ఈవో రాజేంద్రం, ఈఈ దుర్గాప్రసాద్, డీఈ రమేశ్‌బాబుతో చర్చించారు. శనివారం మేడారం పర్యటనకు వచ్చిన పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క, కలెక్టర్ ఇలా త్రిపాఠి, అడిషనల్ కలెక్టర్ శ్రీజ, ఎస్పీ శబరీశ్‌కు బెల్ట్ వినియోగంపై వివరించారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని మంత్రి దేవాదాయ శాఖ అధికారులకు సూచించారు.

## మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

హసన్‌పర్తి, జనవరి 6: భారతీయ స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళలకు టైలరింగ్‌లో 30 రోజులపాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ బాస రవి తెలిపారు. హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లోని అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు, తెలుగులో రాయడం, చదవడం వచ్చి ఉండాలని సూచించారు. తెల్లరేషన్‌కార్డు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల మహిళలు 4 పాస్‌ఫొటోలు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, విద్యార్హత జిరాక్స్ ప్రతులను తీసుకొని హసన్‌పర్తిలోని ఎస్‌బీఐ ఆర్‌ఎస్‌ఈటీఐలో ఈ నెల 17వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 18 నుంచి శిక్షణ ప్రారంభం అవుతుందని తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన వసతి ఉంటుందని, కోర్సుకు సంబంధించిన మెటీరియల్‌ను ఉచితంగా అందిస్తారన్నారు. శిక్షణ అనంతరం అభ్యర్థులకు స్కిల్ ఇండియా సర్టిఫికెట్, టూల్ కిట్స్ అందజేస్తారని వెల్లడించారు. వివరాలకు 9704056522, 9849307873, 6281260878, 9949108934 సెల్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# 'ఆరు గ్యారెంటీల'కు 11,90,737 అర్జీలు

- 'ప్రజా పాలన' గ్రామసభల్లో దరఖాస్తుల వెల్లువ
- ఉమ్మడి జిల్లాలో ముగిసిన స్వీకరణ ప్రక్రియ
- ఈ నెల 17లోగా ఆన్‌లైన్‌లో నమోదు
- సోమవారం నుంచి ఎమ్మార్వో, ఎంపీడీవో కార్యాలయాల్లో దరఖాస్తులకు అవకాశం



హనుమకొండలో దరఖాస్తులు ఇస్తున్న లబ్ధిదారులు

| జిల్లా | దరఖాస్తులు |
|---|---|
| వరంగల్ | 2,88,176 |
| హనుమకొండ | 2,50,367 |
| మహబూబాబాద్ | 2,17,224 |
| భూపాలపల్లి | 1,46,458 |
| జనగామ | 1,78,843 |
| ములుగు | 1,09,669 |
| మొత్తం | 11,90,737 |

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జనవరి 6 : అభయహస్తం 'ప్రజాపాలన గ్రామ సభలు' ఉమ్మడి జిల్లాలో శనివారం ముగిశాయి. 'ఆరు గ్యారెంటీల' కోసం మొత్తంగా 11,90,737 దరఖాస్తులు ప్రజల నుంచి వచ్చినట్లు అధికారయంత్రాంగం ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 28న ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా ఇప్పటివరకు దరఖాస్తులు ఇవ్వనివారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సోమవారం నుంచి ఎమ్మార్వో, ఎంపీడీవో కార్యాలయాల్లో ఇచ్చే వెసులుబాటు ఉంటుందని సర్కారు ప్రకటించింది. కాగా ఈ నెల 17లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తుల నమోదు ప్రక్రియను పూర్తి చేసేందుకు అధికారయంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఆరు గ్యారెంటీల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగింది. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోనివారు ఎమ్మార్వో, ఎంపీడీవో కార్యాలయాల్లో ఇవ్వవచ్చని ప్రభుత్వం తెలిపింది. అత్యధికంగా వరంగల్ జిల్లాలో 2,88,176 దరఖాస్తులు వచ్చాయి. పది రోజుల్లో మొదటి రెండు మూడు రోజులు, చివరి రోజుల్లో ప్రజలు భారీగా దరఖాస్తులు ఇచ్చారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని గ్రామాల్లో ఒకరోజు చొప్పున, పట్టణాల్లోని వార్డులు, నగరాల్లోని డివిజన్లలో ఎనిమిది రోజులపాటు నిర్వహించారు. గ్రామసభలు, వార్డు సభలు నిర్వహించిన ప్రభుత్వం అభయహస్తం పేరుతో ఐదు పథకాల అమలు కోసం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. మహాలక్ష్మీ, ఇందిరమ్మ ఇండ్లతో పాటు కొత్త రేషన్ కార్డుల కోసం ఎక్కువ మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులను అధికారులు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లోకి అప్‌లోడ్ చేస్తున్నారు. ఈనెల 17లోపు దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి కానున్నది. ఈ మేరకు ఇప్పటికే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. డేటా ఎంట్రీ పూర్తయిన తర్వాత లబ్ధిదారులను ప్రభుత్వం ఎంపిక చేయనున్నట్లు అధికారులు తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలో మొత్తం 2,39,424 కుటుంబాలకు గాను 2,17,224 కుటుంబాల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ పేర్కొన్నారు. ములుగు జిల్లా వ్యాప్తంగా ఉన్న 174 గ్రామ పంచాయతీల్లో 1,09,669 దరఖాస్తులు వచ్చాయి. హనుమకొండ జిల్లాలో 2,50,367 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ వెల్లడించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 1,46,458, జనగామ జిల్లాలో 1,78,843 అర్జీలు వచ్చినట్లు ఆయా జిల్లాల కలెక్టర్లు తెలిపారు.

## ఎస్టీ కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ఏటూరునాగారం, జనవరి 6 : స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ నిర్వహించే కానిస్టేబుల్ పరీక్షలకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి దరఖాస్తు చేసుకున్న గిరిజన అభ్యర్థులకు ఐటీడీఏ ద్వారా 45 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పీవో అంకిత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న కాపీతో పాటు విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్‌తో ఈనెల 12లోగా హనుమకొండలోని పీఈటీసీ కార్యాలయంలో సమర్పించాలన్నారు. గతంలో గిరిజన సంక్షేమశాఖ ద్వారా శిక్షణ పొందిన అభ్యర్థులను పరిగణలోకి తీసుకోమన్నారు. మరిన్ని వివరాలకు 0870-350644 నంబర్‌ను కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని పీవో సూచించారు.

## గ్రూప్స్‌కు బీసీ స్టడీ సర్కిల్ ఉచిత శిక్షణ

హనుమకొండ చౌరస్తా, జనవరి 6 : గ్రూపు-1,2,3,4 ఉద్యోగాలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఎంపీవీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా అభ్యర్థులు తమ పేర్లను ఈ నెల 8 నుంచి 20వ తేదీలోగా www.tsbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.5 లక్షల్లోపు ఉండాలని, రిజర్వేషన్, డిగ్రీ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 0870-2571192, 040-24071178, 040-27077929 నంబర్లలో సంప్రదించాలన్నారు.

## ట్రాఫిక్ ఎస్సై డేవిడ్ సస్పెన్షన్

సుబేదారి, జనవరి 6 : హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ డేవిడ్‌ను సస్పెండ్ చేస్తూ సీపీ అంబర్ కిశోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. హనుమకొండ ట్రాఫిక్ ఎస్సైగా పని చేస్తున్న డేవిడ్ మూడు రోజుల క్రితం ములుగురోడ్డు వద్ద వాహనాల తనిఖీ సమయంలో ఓ వాహనదారుడి నుంచి డబ్బులు తీసుకున్న వీడియో వాట్సాప్‌లో వైరల్ అయింది. ఈ వీడియోను ఆధారంగా పోలీసు నిఘా వర్గాలు విచారణ చేపట్టగా, వాహనదారుడి నుంచి డబ్బులు తీసుకున్నట్లు రుజువు కావడంతో శనివారం సీపీ ఎస్సై డేవిడ్‌ను సస్పెండ్ చేశారు.


Softpath System, LLC and Exceed Management Pvt.Ltd.

WE ARE HIRING! Join our team

50 Openings for internship WALK-IN-INTERVIEWS

Qualification:
Graduates from any discipline pursuing final year and those who passed out in 2023

Interview Dates:
Jan 08th and Jan 09th
( Monday and Tuesday )
(2 PM to 8 PM IST)

If interested, send your resume to warangal@softpath.net
Contact : 93469 89743

SOFTPATHSYSTEM | OPTEVUS | WYDOR | Exceed

Exceed Management Pvt Ltd (Subsidiary of Softpath System LLC)

Walk-in@ 1st floor,Chaitanya (Deemed to be University),Jagruthi Colony, Kishanpura, Hanumakonda-506001, Telangana



పితృ యజ్ఞం



స్వస్తిశ్రీ శోభకృత్ నామ సం॥ర మార్గశిర బ॥ తదియ తేది: 30-12-2023 రోజున ఉ॥ 11-50 ని.లకు మా తండ్రి గారైన శ్రీ కోల జనార్ధన్ పటేల్ గారు శివైక్యం చెందారని తెలుపుటకు చింతిస్తున్నాము. తేది. 8-01-2024 సోమవారం దశదినకర్మ జరుపబడును. కావున తామెల్లరు విచ్చేసి, మా తండ్రి గారి ఆత్మకు శాంతి చేకూర్చగలరని మనవి.

కీ॥శే॥ కోల జనార్ధన్ పటేల్ గారు
ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు

కార్యస్థలం : స్వగృహము, ఘనపురం (ములుగు), జి॥ జయశంకర్ భూపాలపల్లి. సెల్: 9652301400
సహపంక్తి భోజనం : మధ్యాహ్నం గం॥ 1-30 ని॥లకు.

ఇట్లు: భార్య : కోల శకుంతల
కుమారుడు - కోడలు : కోల చిరంజీవి పటేల్-వనిత
మనుమడు : కోల శివరాం పటేల్